క్లుప్తంగా

గౌరీపరమేశ్వరులకు వెండి ఆభరణాల అలంకరణ


వెండి ఆభరణాలతో గౌరీపరమేశ్వరులు

మల్కాపురం: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని గౌరీదేవి ఆలయంలో గౌరీపరమేశ్వర్వుల ఉత్సవాలను స్థానిక గౌరీ సేవా సంఘం ప్రతినిధులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం పలువురు భక్తులు పంచామృతాలతో అభిషేకాలు,సుగంధ పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులకు గౌరీ పరమేశ్వర్వులకు ఆలయ నిర్వాహకులు వెండి ఆభరణాలను అలంకరించారు. మహిళలు లలిత పారాయణం,కోలాట ప్రదర్శన చేశారు.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సబ్బవరం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో సెల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు–లాభాల అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాధ,నాగమణి, పాణి తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


కర్పూరం వెలిగిస్తున్న కన్నెస్వాములు

మల్కాపురం: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం పడి పూజలు జరిగాయి. పలువురు కన్నె స్వాములు అయ్యప్ప స్వామి పీఠం ముందు కర్పూరం వెలిగించారు.ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ భక్తుల శరణు ఘోషతో దద్దరిల్లింది. పూజా కార్యక్రమంలో సుమారు రెండు వందల మంది అయ్యప్ప భక్తులు పూజలు చేశారు.

బీజేపీ 'పశ్చిమ' కన్వీనర్‌గా రమేష్


రమేష్

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా దాడి పురుషోత్తం రమేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- గ్రీన్ బెల్ట్‌లో ఓపెన్ జిమ్
- పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- సౌకర్యవంతంగా వాకింగ్ ట్రాక్
- వెలుగులు విరజిమ్మేలా విద్యుదీకరణ


బెంచీలపై సేదతీరుతున్న సీనియర్ సిటిజన్లు


వ్యాయామం చేస్తున్న వాకర్స్



గ్రీన్‌బెల్ట్


వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన పరికరాలు

విశాఖ విద్య: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాల రూపు రేఖలు మారాయి. విశాఖను అగ్రపథాన నిలబెట్టాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా జీవీఎంసీ గ్రీన్‌బెల్ట్‌ల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. హైవేకు ఆనుకుని ఉన్న స్థలాలను ఉద్యాన వనాలుగా మార్చింది. అంతటితో ఆగకుండా ఆహ్లాదం.. ఆరోగ్యం పంచేలా వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసింది. వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేసింది. దీంతో ఉదయం, సాయంత్రం వేళలో గ్రీన్‌బెల్ట్‌లు జన సంచారంతో సందడిగా కనిపిస్తున్నాయి.

హైవేపై హాయిగా : హైవేపై ప్రయాణం సాగించే వాహనదారులు గ్రీన్‌బెల్ట్ సొగసు చూసి మురిసిపోయేలా ఆధునికీకరణ పనులు చేపట్టారు. పశ్చిమ నియోజక వర్గం పరిధి ఎన్ఏడీ కూడలి నుంచి మర్రిపాలెం వరకు ఉన్న గ్రీన్ బెల్ట్‌ను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. 52వ వార్డు పరిధిలో గ్రీన్ బెల్ట్‌ల అభివృద్ధిపై డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మారియట్ హోటల్ ఎదుట, నవ్యాంధ్ర స్కూల్, పాస్‌పోర్టు ఆఫీస్, అపర్ణ అపార్టమెంట్, జిందాల్ బిల్డింగ్ వద్ద ఉన్న గ్రీన్ బెల్ట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. గ్రీన్ బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుతో పాటు అధునాతన వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచారు. దీంతో పిల్లలతో పాటు, పెద్దలు సైతం గ్రీన్‌బెల్ట్‌కు ఉదయం, సాయంత్రం వేళ క్యూ కడుతున్నారు.

ఇన్నాళ్లకు కల నెరవేరింది



మర్రిపాలెం వుడా లే అవుట్ వాసులకు సౌకర్యవంతంగా ఉండేలా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఎంతో కాలం నుంచి విన్నవిస్తున్నాం. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల ఇన్నాళ్లకు మా కోరిక నెరవేరింది.చాలా సంతోషంగా ఉంది.

– డి. లక్ష్మణరావు, వాకర్స్ అసోసియేషన్ ట్రెజరర్, మర్రిపాలెం

ఎంతో సౌకర్యం



గ్రీన్‌బెల్ట్ సుందరంగా తీర్చిదిద్దడం వల్ల అందరికీ సౌకర్యవంతంగా ఉంది. వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. కోవిడ్ తరువాత పిల్లలు, పెద్దలు అంతా వ్యాయామానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే వీటిని అభివృద్ధి చేయాలని మా క్లబ్ ద్వారా ఎప్పటి నుంచో కోరుతున్నాం. ఇప్పటికైనా అభివృద్ధి చేయడం సంతోషం.

– పట్నాయక్, వుడా లే అవుట్ క్లబ్ అధ్యక్షుడు

అందరికీ ఉపయోగం



గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయడంతో అందరికీ ఉపయోగపడుతుంది. గ్రీన్‌బెల్ట్ ఏరియాలో విద్యుత్ లైట్లు కూడా ఏర్పాటు చేశారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎంతో శ్రద్ధ తీసుకోవడం వల్లే గ్రీన్‌బెల్ట్‌లో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. ఇక్కడ ధ్యానం చేయటకు వీలుగా సౌకర్యాలు కల్పిస్తే మరింత బాగుంటుంది.

– కె.నాగేశ్వరరావు, మర్రిపాలెం వుడా లేఅవుట్ క్లబ్ అధ్యక్షుడు

ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం



హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌ల అభివృద్ధితో ఆ రహదారిలో ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. వీటిని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్రీన్‌బెల్ట్‌లో మోడల్ లైటింగ్‌తో పాటు, తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. ప్రజల అవసరాలు తీర్చాలనేది నా లక్ష్యం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

పేదల సంక్షేమం కోసం జగనే కావాలి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- యల్లపువానిపాలెంలో వై ఏపీ నీడ్ జగన్


ప్రభుత్వ పథకాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: పేదల సంక్షేమం కోసం మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెంలో శుక్రవారం వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా 466 సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ముత్తంశెట్టి ఆవిష్కరించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. ఆంధ్రదేశ్‌కు జగన్ మోహన్ రెడ్డి ఎందుకు కావాలన్న అంశాలను వివరించారు. ఇక్కడి సచివాలయం పరిధిలో రూ.15.94 కోట్లు సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేశామన్నారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు రూ.4 కోట్లు వెచ్చించినట్టు చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కులం, మతం, పార్టీ చూడకుండా లబ్ధిచేకూర్చి చరిత్ర సృష్టించారని చెప్పారు.

చెంతకే సంక్షేమం

సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ప్రభుత్వాని ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. బడుగు, బలహీన వర్గాలు క్షేమంగా ఉండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలన్నారు.

ఉత్సాహంగా గడప గడపకు...

యల్లపువానిపాలెంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి వైఎస్సార్ నగర్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు ముత్తంశెట్టి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, ఏపీడీ శ్రీరామ్, అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా తిరువీధి


తిరువీధిలో స్వామివారి ఉత్సవమూర్తులు


తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: వృశ్చిక సంక్రమణాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్ఠింపజేసి సింహగిరి మాడవీధుల్లో సాయంత్రం తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

వచ్చే నెల 17న వైజాగ్ మారథాన్


టీషర్ట్, మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ రవిశంకర్, నిర్వాహకులు

విశాఖ స్పోర్ట్స్: సాగరతీరంలో డిసెంబర్ 17న వైజాగ్ మారథాన్ జరగనుంది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ పరుగు నాలుగు విభాగాల్లో నిర్వహించనున్నారు. 21 కిలోమీటర్ల పరుగుతో పాటు 10 కి.మీ., 5 కి.మీ., 3 కి.మీ. పరుగు పార్క్ హోటల్ దరి వైఎస్సార్ విగ్రహం చెంత ప్రారంభించి అక్వేరియం, రోప్ వే మీదుగా రాడిసన్ హోటల్ వద్ద టర్న్ తీసుకుని తిరిగి వీఎంఆర్డీఏ పార్క్ వద్దకు చేరుకోవడంతో ముగియనుంది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలన్నారు. వైజాగ్ మారథాన్ నిర్వాహకులు ఔత్సాహికులకు అందించే టీషర్ట్, మెడల్స్‌ను ప్రదర్శించారు. అల్పాహారాన్ని ఔత్సాహికులకు అందిస్తామని, దారి వెంట వైద్య సహాయకులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైజాగ్‌మారథాన్.కామ్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం

డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలియజేశారు. ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా టపాసులు, గ్యాస్ సిలిండర్లు, యాసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లు, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావొద్దన్నారు. ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశముందని ఆయన చెప్పారు. వీటి వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయంలో వాల్తేర్ డివిజన్ ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు సివిల్ డిఫెన్స్ సభ్యులు, టీటీఈలు, కోచ్ అటెండెంట్స్, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేలుడు పదార్థాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటివి గుర్తించిన వారు వెంటనే రైల్వే అధికారులకు, రైళ్లలో ఉండే సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని డీఆర్ఎం సూచించారు.

27 వాహనాలపై కేసులు


వాహనాన్ని తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 27 వాహనాలపై కేసులు నమోదు చేశామని ఉపరవాణ కమిషనర్ రాజారత్నం తెలిపారు. రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలతో పాటు అధిక లోడుతో నడుపుతున్న వాహనాలపై మొత్తం 27 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో మోటారు వాహన తనిఖీ అధికారులు ఏఎస్ గణేష్ రెడ్డి, రోఖిమున్నీష, సహాయ మోటారు వాహన తనిఖీ అధికారులు పి.శిరీష, సుమన్ కుమార్, ఎంఎస్‌వీ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

నేడు ఏయూలో జాబ్‌మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు బ్యూరో డిప్యూటీ చీఫ్ దొరబాబు తెలిపారు. హెటిరో సంస్థ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో 25 ఖాళీల భర్తీకి ఫార్మసీ కోర్సులు, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ చేసిన వారు అర్హులు. వీరికి రూ.2.7 లక్షల వార్షిక వేతనం అందిస్తారు. బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులు అర్హులు. జూనియర్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఐటీఐ ఫిట్టర్, మెకానికల్ డిప్లమో చేసిన వారు అర్హులు. మెడ్‌ప్లస్ సంస్థలో ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు ఫార్మసీ చదివిన వారు, ఫార్మసీ ఎయిడ్, సీఎస్ఏ, ఆడిట్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్ అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12 వేలు నుంచి రూ.18 వేల వరకు వేతనం ఇవ్వనున్నారు. పూర్తి వివరాలకు 9666092491 నంబరులో సంప్రదించవచ్చు.

ఉద్యోగుల స్పందనకు 46 వినతులు


ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో మోహన్‌కుమార్

మహారాణిపేట : కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఆర్వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనకు 46 వినతులు వచ్చాయి. జిల్లా, మండల కార్యాలయాల్లో విధుల నిర్వహించే వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులను అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, ఏవో ఈశ్వరరావు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. నిర్ణీత కాలంలో వీటికి పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సౌకర్యార్థం ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల స్పందన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్న ప్రజలు


40వ వార్డులో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు


పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సింధియా: పశ్చిమ నియోజకవర్గంలో నాగుల చవితి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పుట్టల్లో పాలు పోసి నాగేంద్రుడి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు పుట్టల్లో పాలు పోసేందుకు క్యూ కట్టారు. షిప్‌యార్డ్‌కాలనీ, సింధియాన్యూకాలనీ, త్రినాథపురం, ఎస్సార్‌కాలనీ, కాకరలోవ, జయేంద్రకాలనీ, యారాడ వేళ్లే మార్గాల్లో ఉన్న పుట్టల్లో ప్రజలు కుటుంబ సమేతంగా పాలు పోసి చవితి వేడుకలను జరుపుకున్నారు. నాగుల చవితి రోజున నాగేంద్రుడిని ఆరాధిస్తే సర్వరోగాలు పోతాయని, రాహు, కుజ దోషాలు తొలగిపోతాయని విశ్వాసం.

- షిప్‌యార్డ్‌కాలనీలో 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పుట్టల వద్దకు వచ్చిన భక్తులకు స్నేక్ సేవర్ సొసైటీ సభ్యులు నాగరాజు పాములపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణానికి మేలు చేసే పాముల జాతులు అంతరించిపోతున్నాయని, పాములు అంతరిస్తే ఎదురయ్యే అనర్థాలను ప్రజలకు వివరించారు. వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పాములు కరిస్తే తీసుకోవాల్సిన వైద్యం, కనిపిస్తే చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.


పారిశ్రామిక ప్రాంతంలో..


మల్కాపురం: నాగుల చవితి పూజలను పారిశ్రామిక వాసులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల వద్ద నాగేంద్రునికి పాలు,చిమిలి,చెరుకులు,తాటి పీచు,గుడ్లు వేసి నాగదోషాలు తొలగించాలని మొక్కుకున్నారు. అయితే ఐవోసీ వద్ద ఖాళీ ప్రదేశంలో హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు జరగతుండడంతో అక్కడ పుట్టలు కనుమరుగయ్యాయి. దీంతో మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంత వాసులు కొండ ప్రాంతాలు యారాడ, జూ, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రదేశాలకు వెళ్లి పూజలు చేసుకోవాల్సిన పరిస్థితి కలిగింది.


జీవీఎంసీ 56,57వ వార్డుల్లో..

కంచరపాలెం: జీవీఎంసీ 56,57వ వార్డుల్లో నాగుల చవితి పూజలు నిర్వహించారు. వేకువ జామునుంచే ప్రజలు నాగేంద్రుడుకి ప్రత్యేక పూజలు చేశారు. రైల్వే లోకోషెడ్‌లోని నిషిద్ధ స్థలాల్లో పండగ సందర్భంగా ప్రవేశానికి ప్రజలను అనుమతి ఇచ్చారు. గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతులపేట, పైడిమాంబ కాలనీ, దయానందనగర్, ముత్యమాంబకాలనీ, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ, డీజిల్ క్వార్టర్స్, దోబీలైన్, శ్యామ్‌నగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా ప్రాంతాలకు చెందిన భక్తులు పూజలు నిర్వహించారు. బాణసంచా టపాసుల సందడితో ఘనంగా భక్తులు నాగులచవితి పూజలు చేశారు.

గోపాలపట్నం: గోపాలపట్నం పరిధిలో లక్ష్మీనగర్, ఇందిరానగర్, గోపాలపట్నం రైల్వే స్టేషన్ ప్రాంతాల్లోని పుట్టల్లో అధిక సంఖ్యలో భక్తులు పాలు పోశారు. భక్తుల రాకపోకలతో రహదారులు సందడిగా మారాయి.


రైల్వేయార్డ్ ప్రాంతంలో పూజలు చేస్తున్న భక్తులు


పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

భగీరథ విలాసం నృత్య రూపకం నేడు


నృత్య రూపకంలో నాట్య విన్యాసం (ఫైల్)

మద్దిలపాలెం: నటరాజ్ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో భగీరథ విలాసం నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నారు. సంస్థ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రముఖ పాత్రికేయుడు అయ్యల సోమయాజుల జోగారావు రచన, ద్వారం త్యాగరాజు సంగీతంలో కూచిపూడి నాట్యకారిణి కె.వి.లక్ష్మీ నృత్య పరికల్పనలో ప్రదర్శన జరగనుందన్నారు. సుమారు గంటన్నర పాటు సాగే భగీరథ నాట్య విలాసం సాయంత్రం 6.15 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి సూదగాని గీతానారాయణ్ హాజరై కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

మర్యాదపూర్వక కలయిక


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాధ

విశాఖ విద్య : జిల్లా వృత్తి విద్యా శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన బి.రాధ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, డీవీఈవోగా బాధ్యతలు చేపట్టినట్లు తెలియజేశారు. వృత్తి విద్య కళాశాలల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచించారు.

డిసెంబర్ 18న వారణాసిలో విశ్వశాంతి మహాయజ్ఞం


విశ్వశాంతి మహాయజ్ఞం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విహంగం యోగ సందేశ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: ప్రపంచ శాంతికి డిసెంబర్ 18న వారణాసిలో 25 వేల హోమగుండాలతో విశ్వశాంతి మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు విహంగం యోగ సందేశ్ ప్రతినిధులు సమిత్‌కుమార్, ఓజా, సుశీల్, యోగీష్‌లు తెలిపారు. శుక్రవారం పిఠాపురం కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. విహంగం యోగ సంస్థ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు సఫల్ దేవ్ మహరాజ్ ఆశీస్సులతో విజ్ఞాన్‌దేవ్ మహరాజ్, స్వతంత్రదేవ్ మహరాజ్‌ల నేతృత్వంలో వేలాది మంది రుత్విక్కులతో అత్యంత నిష్టగా మహాయజ్ఞం నిర్వహిస్తామన్నారు. ఈ యజ్ఞానికి ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అంగీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న గురుద్వారా స్మార్ట్ ఇన్ హోటల్‌లో విజ్ఞాన్‌దేవ్ మహరాజ్, స్వతంత్రదేవ్ మహరాజ్‌లు విహంగం యోగాపై సత్సంగం, మెడిటేషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.